# ఆకలేస్తోందమ్మా

గున్నేపల్లి సరోజినీదేవి




సంధ్యాకిరణాలు కిటికీ గుండా నులివెచ్చగా ముఖాన్ని తాకగానే టక్కున కళ్ళు తెరిచింది విశాలి.

మధ్యాహ్నం భోజనం చేశాక, ఏదో పుస్తకం చదువుకుంటూ పడుకుంటే, తనకి తెలియకుండానే నిద్ర పట్టేసినట్లుంది.

ఆదిత్య స్కూలు నుండి వచ్చే టైం అయ్యింది. వస్తూనే తినడానికేమైనా పెట్టమని అడుగుతాడు అనుకుంటూ లేచి గబగబా వంటగదిలోకి నడిచింది.

పగటి నిద్ర అలవాటు లేదేమో, తలంతా దిమ్ముగా వున్నట్లుంది. కొంచెం కాఫీ త్రాగితే గాని ఈ నిద్ర బద్ధకం పోదు అనుకుంటూ పాలు 'స్టౌ' మీదుంచి, వెళ్ళి చన్నీళ్ళతో ముఖం కడుక్కుని వచ్చింది.

కొంత సేద తీరినట్లుగా వుంది.

త్వరగా తయారయ్యేదేముందీ..అనుకుంటూంటే ఎదురుగా అలమరలో నూడిల్స్ పాకెట్టు కన్పించింది.

అదంటే ఆదిత్యకి కూడా యిష్టం అనుకుంటూ ఫ్రిజ్‌లోంచి కావలసిన వస్తువులు తీయబోతూంటే బయటినుండి ఎవరో పిలిచినట్లయి వీధి గుమ్మంలోకి వచ్చి చూసింది విశాలి.

పది, పన్నెండేళ్ళకంటే ఎక్కువుండవు. మాసిన బట్టలతో వున్న కుర్రాడొకడు, గేటు దగ్గర తారట్లాడుతున్నాడు.

విశాలిని చూడగానే "ఆకలేస్తోందమ్మా..కొంచెం అన్నం..." అంటూ నసిగాడు.

"అడుక్కోవటానికైనా వేళాపాళా లేదూ..అయినా..." అంటూ గబుక్కున ఆగిపోయింది విశాలి.

పక్క పోర్షను వరండాలో చదువుకుంటున్న స్టూడెంటు కుర్రాడు, ఒకసారి తలెత్తి ఆ కుర్రాడి వంకా, విశాలి వంకా చూశాడు. 'ఏ టైము కొస్తే..పెడుతుందో ఈవిడ..' అనుకుంటూ మళ్ళీ పుస్తకంలోకి తల దూర్చాడు.

కుర్రాడు అడుక్కునే వాడులా లేడు. ఆకుపచ్చ నిక్కరూ, మాసిపోయిన తెలుపురంగు చొక్కా..గవర్నమెంటు స్కూల్లో చదువుతున్నట్లున్నాడు. లేక ఎవరైనా యిచ్చిన పాత బట్టలు వేసుకున్నాడా?

"ఏంరా..ఏం చదువుతున్నావు?"

"....."

"మీ అమ్మా, నాన్న ఏం చేస్తుంటారు?"

"....."

"బడికి వెళ్ళమని పంపిస్తే రోడ్లంట తిరుగుతూ ఏ గోళీకాయలో ఆడుతూ..యిలా అడుక్కుంటున్నావా?"

"....."

"స్కూల్‌కి వెడితే మధ్యాహ్నం ఏ భోజనమో పెడతారు కదా!"

వాడుదేనికీ సమాధానం చెప్పలేదు. తనని కానట్లు చూస్తూ వుండిపోయాడు.

ఏదో కొంచెం పెడితే పెట్టాలి గాని ఆవిడకి, వీడి బయోడేటా ఎందుకో. అనుకున్నాడు స్టూడెంటు కుర్రాడు.

మళ్ళీ, అంతా గమనిస్తూ.

"అన్నం.." అన్నాడు కుర్రాడు ఆ మాటొక్కటే వచ్చినట్లు దీనంగా.

"పోరా..పో..అవతల నాకు బోల్డు పనుంది" అంటూ విసవిసా లోపలికి నడిచింది విశాలి.

'అసలే ఆలస్యమయిందనుకుంటూంటే వీడొకడు మధ్యలో..' అని విసుక్కుంది.

విశాలి పనిచేసుకుంటున్నా, దీనంగా వున్న వాడి ముఖమే ఆమెని వెంటాడుతున్నట్లుంది. 'పోనీ ఈ ఒక్కసారికీ ఏమైనా పెడితే బావుండేది' అనుకుంది జీవితంలో మొదటిసారిగా.

'డిస్కరేజ్ బెగ్గర్స్' అనేది విశాలి పాలసీ.

చిన్నప్పుడు అమ్మమ్మగారి వూరిలో తిరనాళ్ళకి వెడితే, అక్కడ ముందుగా ముష్టివాళ్ళే కన్పించే వాళ్ళు. రకరకాల ముష్టివాళ్ళు, కుంటీ, గుడ్డీ దారికి అటూ, యిటూ బారులు తీరి కూర్చుని కేకలు పెడుతుంటే - మధ్యలోంచి తిరణాలలోకి ప్రవేశించాల్సి వచ్చేది. అమ్మ కొంగు చాటునో, అమ్మమ్మ చెంగు చాటునో భయంగా నక్కి, అటూ యిటూ చూడకుండా నడిచేది.

తిరణాలలో అమ్మవారిని చూసి నచ్చిన లక్క పిడతలూ, బొమ్మలూ కొనుక్కుని యింటికి వచ్చినా ఆ యాచకుల జ్ఞాపకాలు కొంతకాలం వెన్నాడుతూనే వుండేవి విశాలిని.


దేవుడు యిలాంటి వాళ్ళని ఎందుకు పుట్టిస్తాడో అనుకొనేది, ఆ వయసులోనే.

వుమెన్స్ కాలేజీలో చదివేటప్పుడు జరిగిన ఒక విషయం విశాలికి ఎప్పుడూ గుర్తుకొస్తూంటుంది.

ఒకసారి సంక్రాంతి సెలవుల్లో సన్నిహితంగా వుండే పదిమంది విద్యార్థినులంతా కలిసి తిరుపతి టూరు వేసుకున్నారు.


పగలు ప్రయాణమైతే సరదాగా గడపవచ్చని పగటి ట్రైనులోనే రిజర్వేషను చేయించుకున్నారు.

కేరింతలతో, ఛలోక్తులతో అరగంట ప్రయాణం సాగిందో లేదో- ముష్టివాళ్లు ఒక్కొక్కరే కంపార్టుమెంటు లోకి ప్రవేశించడం, భజనలతో పాటలతో అక్కడంతా హోరెత్తించి, రెండు,



మూడు స్టేషన్ల తరువాత దిగిపోవటం, యించు మించు ప్రయాణమంతా యిలాగే సాగింది.

"రైల్వేలు పెద్ద సంస్థ కదా! ఈ సంస్థ కల్పిం చుకుని, వీళ్ళందరికీ ఏదో బ్రతుకు తెరువు చూపించి, ప్రయాణీకులకి ఈ బెడద తప్పించవ చ్చుకదా! అసలు కంపార్టుమెంటులోకి వీళ్ళని ఎలా ఎలౌచేస్తున్నారు" అంది విశాలి మార్గమధ్యలో ఒకసారి సహాధ్యా యినులతో.



వాళ్ళల్లో ఎవరో ఒకరు ఒక రూపాయో, రెండో బిచ్చగాళ్ళకి దానం చెయ్య బోతే, 'అలా ప్రోత్సహించ కుంటే, కష్టపడకుండా ఇదే బావుందని దీనికీ అలవాటుపడిపో తారు' అనేది.

ఏ అంగవికలురో యాచనకొచ్చిన ప్పుడు, ఆటపట్టిస్తూ, "పోనీ..వీళ్ళకి వెయ్యొచ్చు..పాపం, పని చేసుకోవటానికి కాళ్ళూ, కళ్ళు సరిగా లేవు కదా" అని స్నేహబృం దంలో ఎవరైనా అంటే..

"అస్సలు వద్దు. ఎక్కువ భిక్షం వస్తుందని, చిన్నప్పుడే వాళ్ళ తల్లిదండ్రులు వాళ్ళనలా తయా రుచేస్తారట..ఎక్కడో చదివాను" అనేది విశాలి.

తిరుపతి స్టేషనులో దిగి బయటికి రాగానే మళ్ళీ యిద్దరు, ముగ్గురు బిచ్చగాళ్ళు చుట్టూ మూగిపోయారు చేతిలోని డబ్బు పాత్రల్ని మ్రోగించుకుంటూ.

"తిరుపతిలాంటి పుణ్యక్షేత్రంలో గూడా ఈ భిక్షాటనేమిటి? దేవస్థానం వాళ్ళు కలుగజేసు కుని ఏదో ఒకటి చెయ్యలేరా?" అంది విశాలి మళ్ళీ ఆవేదనగా.

"ఆపవే బాబూ నీ ముష్టిగోల..సరదాగా విహా రయాత్రకొస్తే ఈ గోలేమిటే బాబూ" అని ఒక మ్మాయి అంటే,

"దీనికి మూడు కోతుల బొమ్మ ఒకటి కొని య్యండే. చెడు వినకు, కనకు, మాట్లాడకు అని, అప్పుడైనా మనని ప్రశాంతంగా వుండనిస్తుం దేమో..కాదు కాదు..తను ప్రశాంతంగా వుంటుం దేమో" అంది మరో స్నేహితురాలు.

అందరూ నవ్వుకున్నారు. పరిసరాలు పట్ట నట్లు అంతా అలా సరదాగా ఎలా వుండగలుగుతారో విశాలికి అర్థమయ్యేది కాదు.

ఆ యాత్రలోనే ఒక చోట పెద్ద 'హోర్డింగ్' ఒకటి చూసింది. 'డిస్కరేజ్ బెగ్గర్స్' అని. ఆ క్షణమే అది తన పోలసీగా మార్చేసు కుంది.

తమ పెళ్ళయ్యాక శంకరం కూడా అంతే. ఇద్దరూ కలిసి ఏ సినిమాకో, షాపింగ్‌కో వెడితే, అక్కడా ముష్టివాళ్ళు తటస్థ పడుతుండేవారు. వాళ్ళని చూడ గానే జేబులో చెయ్యి పెట్టి, చేతికి ఎంత దొరికితే అంతా వాళ్ళకి దానం చేస్తూండే వాడు శంకరం.

"అలా ఎంకరేజ్ చెయ్యకండీ" అని విశాలి అంటే నవ్వేసి వూరుకునే వాడు. ఇప్పటికీ అతని తరహా మారినట్లు అన్పించదు.

అయాచితంగా కడుపునిండుతుంటే యాచకులు కష్టపడి బతకాలన్న ప్రయత్నమే చేయరన్నది విశాలి వాదన.

ఆలోచిస్తూనే వంట గదిలో పని పూర్తి చేసింది విశాలి.

ఆదిత్య వచ్చినట్లున్నాడు. పుస్తకాల సంచి సోఫాలో పడేసి, నేరుగా గదిలోకి వెళ్ళి నిస్త్రాణగా పడుకుండిపోయాడు. విశాలికి చిత్రమనిపించింది. రోజులా 'అమ్మా..' అంటూ వచ్చి తల్లిని వాటేసుకోలేదు ఆదిత్య.

ఆదిత్య బూట్లు కూడా విప్పకుండా పడుకుండిపోయాడు.

"ఏం నాన్నా..వంట్లో బావుండలేదా?" అంటూ నుదిటి మీద చెయ్యేసి చూసింది. వేడిగా జ్వరం వచ్చినట్లుంది.

బూట్లు విప్పి, బట్టలు మార్చి ఆదిత్యని సరిగా పడుకోబెట్టింది విశాలి "తాగడానికి ఏమైనా తీసుకురానా.." అని అడిగింది.

"వద్దమ్మా..పడుకుంటాను. దుప్పటి కప్పు" అంటూనే మగతలోకి జారిపోయాడు ఆదిత్య.

కాసేపు పడుకోనీలే...అనుకుంటూ దుప్పటి కప్పి హాల్లోకొచ్చి కూర్చుంది విశాలి.

మళ్ళీ ఆ కుర్రాడు కళ్ళముందు కదిలాడు. ఏదైనా కొంచెం పెట్టవలసింది, అనుకుంది.

విశాలి మధ్య మధ్యలో వెళ్ళి కొడుకుని చూస్తూనే వుంది. ఆదిత్య వులుకూ పలుకూ లేకుండా అలాగే పడుకుని వున్నాడు.

విశాలి శంకరానికి ఫోన్ చేసింది.

ఇంట్లో వున్న జ్వరం టాబ్లెట్ ఏదో చెప్పి, ఆ పూటకి అది వెయ్యమన్నాడు. మరునాడు ఉదయానికి జ్వరం తగ్గకపోతే అప్పుడు డాక్టరుకి చూపించవచ్చున్నాడు.

తను డైరెక్టర్ల మీటింగులో వున్నాననీ, తను వచ్చేసరికి ఆలస్యం కావచ్చనీ చెప్పాడు శంకరం.

టాబ్లెట్టుతో యిచ్చిన ఆ కాసిని మంచినీళ్ళు తప్పితే, విశాలి ఎంత ప్రయత్నించినా, ఆ రాత్రంతా ఏమీ తీసుకోలేదు ఆదిత్య.

మరునాడు ఆదిత్యని డాక్టరుకి చూపించారు శంకరం విశాలి.

ఆయన కొన్ని టెస్టులు చేయించి, ఏవో మందులు రాసిచ్చాడు.

రెండు రోజులు వాడినా ఆదిత్యలో మార్పేమీ లేదు. జ్వరం వస్తోంది, తగ్గుతోంది. మందులతో యిచ్చే నీళ్ళు తప్పితే, ఏమిచ్చినా, తినటం లేదు, త్రాగటం లేదు ఆదిత్య.

మూడో రోజు మళ్ళీ డాక్టరు దగ్గరికి పరుగెట్టారు శంకరం, విశాలి.

డాక్టరు మళ్ళీ కొన్ని టెస్టులు చేసి, మందులు మార్చి యిచ్చాడు.

నెమ్మదిగా తగ్గుతుందనీ, త్రాగటం లేదు, తినడం లేదు అని వూరుకోకుండా ఎలాగైనా ద్రవ పదార్థాలు యివ్వమనీ మందలించాడు డాక్టరు. నెమ్మదిగా బ్రెడ్డూ, జావలాంటి పదార్థాలు కూడా అలవాటు చెయ్యమన్నాడు.

డాక్టరు చెప్పినట్లే టాబ్లెట్సుతోపాటు జ్యూస్ అనీ, మజ్జిగనీ యివ్వటం మొదలు పెట్టింది విశాలి అతికష్టమ్మీద.

ఆదిత్య మెల్లగా కోలుకోవటం మొదలుపెట్టాడు.

ఆదిత్య అనారోగ్యంతో విశాలికి కూడా నిద్ర కరువయింది. దిగులుతో ఆమెకీ ఏమీ తినాలనిపించటం లేదు.

ఆదిత్య లేచి, ఎప్పుడు మామూలుగా తిరుగుతాడా, కావలసినవి అడిగి ఎప్పుడు తింటాడా అనుకుంటోంది. ఆకలికి వున్న విలువేమిటో తెలిసినట్లయింది విశాలికి.

మరో రెండు రోజులు గడిచిపోయాయి.

ఒక రాత్రివేళ, ఎవరో పిలిచినట్లయి, ఉలిక్కి పడి లేచింది విశాలి.

ఆదిత్య! ఆకలేస్తోందమ్మా అన్నాడు. మంచం మీద లేచి కూర్చుని.

విశాలికి నిద్రమత్తు వదిలిపోయింది. సంతోషంతో వెయ్యేనుగుల బలం వచ్చినట్లయింది ఆమెకి.


రెండు నిమిషాల్లో పాలు వేడి చేసి, బ్రెడ్ ముక్కలు ముంచి ఆదిత్యకి తినిపించింది.

"యింక చాలమ్మా" అంటూ పడుకుని, వెంటనే ప్రశాంతంగా నిద్రలోకి జారిపోయాడు ఆదిత్య.

ఆదిత్య క్రమంగా కోలుకున్నాడు. విశాలి కూడా మామూలుగా తన పనులు తను చేసుకోసాగింది.

"అప్పుడే వాడ్ని స్కూలుకు పంపకు. అవసరమయితే ఈవారం రోజులు నోట్సులూ ఫ్రెండ్సు దగ్గర తీసుకుని రాసుకుంటాడులే" అన్నాడు శంకరం ఆఫీసుకు వెడుతూ.

ఒకరోజు సాయంత్రం పనిమనిషి సుబ్బులు ఒకబ్బాయిని వెంటబెట్టుకుని వచ్చింది. వాడ్ని పెరట్లోనే ఒక ప్రక్కన కూర్చోమని చెప్పి, తను



## సరికొత్త సుల్తాన్

దాదాపు రెండేళ్ళుగా నిర్మాణంలో వున్న 'సుల్తాన్ ది వారియర్' యానిమేటెడ్ మూవీకి రజనీకాంత్ కూతురు సౌందర్య టెక్నికల్ డిజైనింగ్‌తోపాటు దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే! ఇంతకాలమైనా ఇంకా ఆ చిత్రం పూర్తి కాలేదు. ఇటీవలే సౌందర్య వివాహం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో తను ఇక ఆ సినిమా బాధ్యతలు నిర్వహించడం కుదరేలా లేదని సౌందర్య తేల్చి, చెప్పడంతో ఆ సినిమాని జెమినీ వారు తీసుకుని పూర్తిచేసే పనిలో వున్నారని చెన్నయ్ సమాచారం. దర్శకుడు కె.ఎస్.రవికుమార్ సినిమాని పూర్తిచేయడానికి అంగీకరించినట్టు కూడా వార్తలు. అన్నీ సజావుగా సాగితే అతి త్వరలోనే 'సుల్తాన్' ప్రేక్షకుల ముందుకు వస్తుందిట.

పనిలో పడింది.

"ఎవరీ అబ్బాయి?" అని సుబ్బుల్ని అడుగుతూనే ఠక్కున ఆగిపోయింది విశాలి.

అదే ముఖం - అవే బట్టలు "నువ్వు..నువ్వు..ఆరోజు మా యింటికొచ్చింది నువ్వే కదూ?" అంది విశాలి.

వాడు మాట్లాడలేదు.

"ఈడు మా యింటికాడ రాములమ్మ కొడుకమ్మా. తల్లీదండ్రీ కూలికి బోతరు. ఈణ్ణి గూడ తీసకపోతే, ఆ మద్దెన ఎవురో పార్టీ వాళ్ళంట వచ్చి అలా పిల్లల్ని పనికి పంపవద్దనీ, అట్లైన జైల్లో ఎడతారనీ బెదిరించినారు. అప్పటేల నుండి సర్కారీ బడికి పోతన్నడు" అంది సుబ్బులు.

"నీ పేరేమిటి?" అంది విశాలి.

వాడు మళ్ళీ మాట్లాడలేదు.

"అమ్మగారు అడుగుతాంటే గుమ్మునుంటావేందిరా?" అని గదిమింది సుబ్బులు.

"సాంబ" అన్నాడు, అప్పటికి నోరు తెరిచి.

"ఏం చదువుతున్నావు?"

"రొండు"

"మరీ రోజు స్కూలుకెళ్ళలేదా?" విశాలి వదిలి పెట్టడం లేదు.

సుబ్బులు కలుగజేసుకుంది "ఎల్తన్నాడమ్మా. రోజూ ఈడికి చద్ది పెట్టి, ఆళ్ళమ్మా నాన్నా మూట గట్టుకుని కూలికి బోతరు.

మద్దిగాల ఈళ్ళకి బడిలోనే అన్నవెట్టేవోరు. ఈ మద్దెల పెట్టడం నేదట. యిస్కోలోళ్ళకి పండు రావాలంట. అయే - దబ్బులు"

ఈడేమో ఆకలికి ఆగనేక, మద్దిగాలే ఇస్కూలు వదిలేసి, రోడ్లంట ఆడతన్నాడు. ఈడెక్కడ బిచ్చమెత్తుకుంటాడోయని ఆల్లమ్మ బయపడతాంది. అందుకే నేనంటేసుకొచ్చా" పెద్ద వివరణ యిచ్చింది సుబ్బులు.

"ఇప్పుడేమైనా తింటావా?" అడిగింది విశాలి.

"నేనెట్టే తీసకొత్తన్నానమ్మా" అంది సుబ్బులు.

"సరే - మధ్యాహ్నం నేనే నీకు భోజనం పెడతాను. బుద్ధిగా స్కూల్లో చదువుకుంటావా" అంది విశాలి.

వాడు ఏం చెప్పాలో తెలియనట్లు విశాలి వంకా, సుబ్బులు వంకా మార్చి మార్చి చూడసాగాడు.

"అమ్మగారు అడుగుతాంటే మాట్లాడవేందిరా"

అని వాణ్ని ఒకసారి గదిమి, "ఎందుకెళ్ళదమ్మా, బంగారం నాగ చదూకుంటడు. ఆ పున్నెం గట్టుకోండమ్మా" అంది సుబ్బులు

"రోడ్డు మీద కనబడితే వూరుకోను. స్కూలు మానేస్తే అన్నం పెట్టను సరేనా" అంది విశాలి వాడికి భయం వుండాలని.

"నేను కనిపెడతానే వుంటనమ్మా. ఆడింక స్కూలు మానడు. నేను మాటిత్తన్నాను" అంది సుబ్బులు.

మరునాడు ఆదివారం. శంకరం, విశాలి బాల్కనీలో కూర్చుని ఉదయం పేపరు చూస్తూంటే, గేటు చప్పుడు చేసుకుంటూ సుబ్బులు, సాంబ అమ్మా నాన్నల్ని తీసుకువచ్చింది. ఆ వెనకే సాంబ.

వాళ్ళు శంకరం-విశాలి దంపతులకు మరీ, మరీ కృతజ్ఞతలు చెప్పుకున్నారు. చెమర్చిన కళ్ళతో "మీ మేలు మరిచిపోనమ్మా, రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు మాయి. పిల్లగాళ్ళను ఏడ పట్టించుకునేది. మీలాంటి పుణ్యమూరుతులుండబట్టే, యింకా ఈ లోకంలో దరమం మిగిలుండాది" అంటూ మళ్ళీ, మళ్ళీ కృతజ్ఞతలు చెప్తూ వెళ్ళిపోయారు.

శంకరానికేమీ అర్థం కాలేదు.

విశాలి ముందు రోజు జరిగిందంతా వివరంగా చెప్పి "రాత్రి మీరు ఆలస్యంగా వచ్చారు కదా! చెప్పటం కుదరలేదు" అంది.

"నీ సిద్ధాంతానికి యిది విరుద్ధమేమో" అన్నాడు శంకరం, ఒకింత కొంటెదనంతో.

"ఏది?"

"డిస్కరేజ్ బెగ్గర్సు కదా నీ పోలసీ'"

"వాడు బెగ్గర్ కాదు. ముందు అది తెలుసుకోండి. ఆకలితో వాడు యాచకుడిగా మారకూడదనే, నేనీ సహాయం చేస్తున్నాను. నిజానికి నా చిన్నప్పుడు, మా యింటికి ఒకరిద్దరు వారాలబ్బాయిలు వచ్చేవారు. అంటే బీద విద్యార్థులు, వారమంతా ఒక్కొక్క రోజు, ఒక్కొక్కరింటికి భోజనానికి వెళ్ళేట్లు ఏర్పాటు చేసుకునేవారు. అలా చదువుకుని గొప్ప గొప్ప వాళ్ళయిన వాళ్ళెంతోమంది వున్నారు. ఈ కరువురోజులొచ్చాకా అలాటి ఏర్పాట్లెక్కడా కన్పించటం లేదు. ఇప్పుడైనా, ఒకింత పెద్దమనసు చేసుకుంటే ఎవరికీ యిదేమీ కష్టం కాదు" అంది విశాలి స్థిరంగా.

○

## కమల్ సెన్సేషన్

కమల్‌హాసన్ ఓ విభిన్న తరహా సినిమాని డైరెక్ట్ చేయబోతున్నాడట. ఇందులో అతనితోపాటు మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నాడట. అంతేకాదు, తమిళ హీరో సూర్య, తెలుగు హీరో రవితేజలు కూడా ముఖ్యపాత్రల్లో కనిపిస్తారని వినిపిస్తోంది. అంతేనా- అంటే ఇంకా వుంది- హీరోయిన్లుగా దీపికా పదుకొనె, జెనీలియా నటిస్తారని, సినిమా బడ్జెట్ దాదాపు 200 కోట్లు వుండొచ్చని చెన్నయ్‌లో సినీజనాలు చెప్పుకుంటున్నారు. అంటే 'రోబో' రికార్డులను తిరగరాసే ప్రయత్నమా? ఏమో చూద్దాం!

